

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 23.4

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

» ఈనెల 28 నుంచి మార్చి 19వరకు పరీక్షలు » జిల్లాలో 50పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
» పరీక్ష కేంద్రాల పరిధిలో 144సెక్షన్ అమలు » నిమిషం ఆలస్యమైతే పరీక్ష కేంద్రానికి నోఎంట్రీ



నల్లగొండ, ఫిబ్రవరి 25: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 50పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో మొత్తం 32,895మంది విద్యార్థులు ఈ పరీక్షలు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి జనరల్ విభాగంలో 12, 707మంది, ఒకేషనల్ విభాగంలో 5,147మంది పరీక్షలు రాయనున్నారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 12,741 మంది ఉండగా, ఒకేషనల్ విభాగంలో 2,300మంది పరీక్షలకు హాజరవుతారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు పరీక్ష కేంద్రాల పరిధిలో 144సెక్షన్ కూడా అమలు చేయనున్నారు. అదేవిధంగా పరీక్షలు జరిగే రోజు ఆయా సమయాల్లో జీరాక్స్ సెంటర్‌లను కూడా మూసివేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షకేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. వీటితోపాటు ప్రతీ పరీక్ష కేంద్రంలో అత్యవసర మందులతోపాటు ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుతారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనికితోడు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అనుకూలంగా ఉండేలా జిల్లాలోని అన్నిరూట్లలో ఆర్టీసీ బస్సులను కూడా నడపనున్నారు.

నిమిషం నిబంధన అమలు

పరీక్షల్లో ఈసారి కూడా నిమిషం నిబంధనను అమలుచేస్తున్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు వస్తే అరగంట ముందుగానే అనుమతిస్తారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షలపై జిల్లాస్థాయిలో హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా కలెక్టర్ ఉండనుండగా ఎస్పీ, డీఐఈవోలు సభ్యులుగా ఉంటారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఒక లెక్చరర్‌తోపాటు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్ఐలు ఉంటారు. రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు కూడా ఉంటాయి.

వీరు పరీ క్ష కేంద్రాల్లో ఉండి పరీక్షల తీరుతెన్నులను పరిశీలిస్తారు. మొత్తం 50 మంది సెంటర్ సూపర్‌వైజర్లు, మరో 50 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతోపాటు అసిస్టెంట్ సూపర్‌వైజర్‌లను నియమించారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ప్రతీ కేంద్రానికి 10 నుంచి 12మంది ఇన్విజిలేటర్లను కేటాయించారు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశాం. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమరాలను ఏర్పాటుచేశాం. థియరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకోవాలి. ఒక్కనిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమంతిచం. పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోను సిబ్బందితోపాటు విద్యార్థులు కూడా మొబైల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకరాకుడదు.

- దస్రూనాయక్, డీఐఈవో నల్లగొండ

ప్రధాన పార్టీల్లో టిక్కెట్ల ఫైట్



లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అన్ని పార్టీల్లో టెన్షన్ మొదలైంది. అభ్యర్థుల ఎంపిక ఓవైపు..ఆశావహుల పైరవీలు మరోవైపు అధిష్ఠానాలకు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి. ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం సర్వేలు చేయిస్తుండగా, మొదటి నుంచి పార్టీనే నమ్ముకొని ఉన్న నేతల్లో గుబులు మొదలైంది. ఎవరికి వారు తమదైన రీతిలో క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఎలాగైనా తమ పార్టీ అభ్యర్థులే గెలిచేలా మూడు ప్రధాన పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

» గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు
» బలమైన అభ్యర్థులతో ఢీకొట్టాలనే వ్యూహంలో బీఆర్ఎస్
» సీనియర్లను రంగంలోకి దించే యోచనలో కమలం పార్టీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు లోక్‌సభ సీట్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అదే ఊపులో ఎంపీ సీట్లను గెలవాలని కసరత్తు చేస్తుంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్ సైతం గట్టి అభ్యర్థులతో ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈసారి కొత్త సమీకరణాలతో సత్తాచాటేందుకు రెడీ అవుతోంది. మూడు పార్టీలనుంచి పోటీ చేసే అవకాశాలు దక్కించుకునేందుకు కీలకనేతలు పావులు కదుపుతున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009నుంచి ఇప్పటివరకు జరిగిన మూడుఎన్నికల్లో ఈరెండు సీట్లలో కాంగ్రెస్సే హవా చాటింది. నల్లగొండ స్థానంలో మూడు పర్యాయాలూ కాంగ్రెస్సే గెలుపొందితే, భువనగిరిలో 2014లో ఒక్కసారి తప్ప మిగిలిన రెండుసార్లూ కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ ఉన్నప్పటికీ 2019 ఎన్నికల్లో రెండు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొంది, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. గుత్తాసుఖేందర్‌రెడ్డి(ప్రస్తుతం శాసనమండలి ఛైర్మన్) నల్లగొండ లోక్‌సభ నుంచి 2009, 2014లలో విజయం సాధిస్తే, 2019లో ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (ప్రస్తుతం మంత్రి) విజయం సాధించారు. భువనగిరి నియోజకవర్గంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధిస్తే, 2014లో బీఆర్ఎస్ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ విజయం సాధించారు. 2019లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి(ప్రస్తుతం మంత్రి) విజయం సాధించారు.

బీజేపీలో టిక్కెట్ ఆశిస్తోన్న సీనియర్లు

కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్ కొలువుదీరుతుందనే నినాదంతో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీనుంచి నల్లగొండ, భువనగిరి స్థానాలకు సీనియర్ నేతలు టిక్కెట్ కోసం పోటీపడుతున్నారు. నల్లగొండ నుంచి పార్టీ కిసాన్‌మోర్చా జాతీయనేత గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, గత ఎన్నికల్లో బరిలో నిలిచిన గార్లపాటి జితేందర్‌కుమార్ టిక్కెట్‌కోసం పోటీపడుతున్నారు. వీరితోపాటు ఇటీవల ఫార్వార్డ్‌బ్లాక్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఆశించిన స్థాయిలో ఓట్లు సాధించిన పిల్లి రామరాజుయాదవ్‌ని పార్టీలో చేర్చుకొని టిక్కెట్ ఇస్తే బలమైన పోటీ ఇచ్చే అవకాశముందని పార్టీ ఉన్నతవర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్, పార్టీ జాతీయ జలవనరుల విభాగం కన్వీనర్ డాక్టర్ వెదిరె శ్రీరామ్, పార్టీ సీనియర్‌నేత డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, పీవీ శ్యాం సుందర్‌రావు బలంగా టిక్కెట్ ఆశిస్తున్నారు. ఈ నేతలంతా ఒకవైపు టిక్కెట్ ప్రయత్నాలు చేస్తూ మరోవైపు పార్టీ నిర్వహిస్తోన్న ప్రజా సంకల్ప యాత్రల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.

బీఆర్‌ఎస్ టిక్కెట్ ఎవరికో ?

బీఆర్ఎస్ సైతం ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో కాంగ్రెస్‌కు ధీటుగా బలమైన అభ్యర్థుల్ని బరిలో దింపేందుకు కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలోనే బీఆర్ఎస్ ఇటీవల నల్లగొండలో కృష్ణాజలాల హక్కుల సాధన పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించడం తెలిసిందే. రెండు స్థానాల్లో అత్యంత బలమైన అభ్యర్థుల్ని బరిలో దింపడం ద్వారా కాంగ్రెస్‌ను ఢీకొట్టాలని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి వ్యూహం రచిస్తున్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి పునర్విభజనకు ముందున్న నల్లగొండ పార్లమెంట్ సీటుకు ఒక పర్యాయం, పునర్విభజన తర్వాత ఏర్పడిన నల్లగొండకు రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేయడంతో మొత్తంగా ప్రస్తుతమున్న నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లోని ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలన్నింటికీ ఆయన ప్రాతినిధ్యం వహించడంతో నల్లగొండ వీలుకాకపోతే భువనగిరిలో సైతం అమిత్ పేరును అధిష్ఠానం పరిశీలించే అవకాశముందని తెలుస్తోంది. నల్లగొండ లోక్‌సభ సీటుకు అమిత్‌రెడ్డితోపాటు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి అభ్యర్థిత్వంపై కూడా ముఖ్యనేత లు చర్చిస్తున్నారు. నియోజకవర్గంలో గిరిజన ఓటర్లు అత్యధికంగా ఉన్నందున ఈ దఫా ప్రముఖ వైద్యుడు డాక్టర్ మాతృనాయక్‌ని బరిలో దింపాలని పార్టీవర్గాల్లో ఒక చర్చ జరుగుతోంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న ఉద్యమనేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి కూడా ఈసారి తనకు అవకాశం కల్పించాలని అధిష్ఠానం వద్ద తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భువనగిరి లోక్‌సభస్థానం నుంచి ఉద్యమనేత జిట్టాబాలకృష్ణారెడ్డి ఈసారి టిక్కెట్ తనకే వస్తుందనే విశ్వాసంతో పనిచేసుకుపోతుంటే, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్ కూడా టిక్కెట్ రేసులో ఉన్నారు. కీలకనేతలే బరిలో ఉండడంతో ఇక్కడ పార్టీ తీసుకునే నిర్ణయంపైనే అందరిలో ఆసక్తి నెలకొంది.

కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వాలకు పోటాపోటీ..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాల ఊపులో ఉన్న కాంగ్రెస్‌నుంచి ఈ దఫా ఈ రెండు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు కీలక నేతలు ప్రయత్నిస్తున్నారు. నల్లగొండ లోక్‌సభ ఇన్‌చార్జిగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి లోక్‌సభ ఇన్‌చార్జిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరిస్తుండడంతో అభ్యర్థుల ఎంపికలో ఈనేతలిద్దరి అభిప్రాయం కీలకంకానుంది. నల్లగొండ లోక్‌సభ స్థానంనుంచి తొమ్మిది మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పోటీకి సిద్ధమైతే ఆయనకు అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందని, ఆయన పోటీకి సుముఖత చూపకపోతే ఆయన తనయుడు పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి, మరో పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి నడుమ టిక్కెట్ ఫైట్ నడిచే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం అధిష్ఠానం అవకాశం కల్పిస్తే తన కుమార్తె శ్రీనిధిరెడ్డిని పోటీలో నిలిపేందుకు సిద్ధమయ్యారు. వీరితోపాటు సామాజిక సమీకరణాలు, పార్టీ విధేయత దృష్ట్యా తనకు పోటీఛాన్స్ దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు కె.శంకర్‌నాయక్ ఆశిస్తున్నారు. భువనగిరి పార్లమెంట్ సీటుకు పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి సోదరుడి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి, జడ్పీమాజీ ఛైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి టిక్కెట్‌కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈస్థానంలో బీసీ అభ్యర్థిని నిలిపే అంశంపై పరిశీలిస్తున్నామని ప్రకటించడంతో ఇక్కడ సమీకరణాలు మారిపోతున్నాయి. ఇంకోవైపు ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో అభ్యర్థులెవరైతే గెలుపు సులభంగా ఉంటుందనే అంశంపై పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తుండడంతో ఈ నివేదికలు సైతం అభ్యర్థి ఎంపికలో కీలకమవుతాయని భావిస్తున్నారు.

నేడు జిల్లాలో అమృత్‌భారత్ స్టేషన్ల పనులకు శంకుస్థాపన

వర్చువల్‌గా పనులను ప్రారంభించనున్న ప్రధాని మోదీ



నల్లగొండ, ఫిబ్రవరి 25: అమృత్ భారత్ స్టేషన్ల కింద ఎంపికైన రైల్వేస్టేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. అభివృద్ధి పనుల్లో అండర్‌పాస్ బ్రిడ్జీలు ఉన్నాయి. నార్కట్‌పల్లి, రాయినిగూడెం, కేశరాజుపల్లి వద్ద అండర్‌పాస్ బ్రిడ్జీలకు శంకుస్థాపన చేయనున్నారు. స్టేషన్‌ల వారీగా పరిశీలిస్తే మిర్యాలగూడ స్టేషన్‌కు రూ.9.50 కోట్లు, నల్లగొండ స్టేషన్‌కు రూ.9.50కోట్లు మంజూరయ్యాయి. రైల్వేస్టేషన్లను ఆధునికీకరించడంతోపాటు మెరుగైన సౌకర్యం కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్‌స్టేషన్ల పథకాన్ని ప్రారంభించింది.

28 నుంచి జిల్లాలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర

నల్లగొండ, డిండి, ఫిబ్రవరి 25: నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ తేదీవరకు విజయ సంకల్ప యాత్ర నిర్వహించనున్నారు. ఈ నెల 28న జిల్లాలోని డిండి వద్ద విజయసంకల్ప యాత్రను ప్రారంభించనుండగా నల్లగొండలో 1వ తేదీన జరిగే బహిరంగ సభతో యాత్ర ముగియనుంది. ఈ యాత్ర మూడురోజులపాటు దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ నియోజకవర్గాల మీదుగా సాగుతుంది. కృష్ణమ్మ క్లస్టర్‌గా పేరు పెట్టిన ఈయాత్ర పలు మండల కేంద్రాలమీదుగా కొనసాగనుంది. ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, డీకేఅరుణ, ఈటల రాజేందర్‌లు పాల్గొననున్నారు. యాత్రలో రోడ్డుషోలతోపాటు మహిళా సమ్మేళనాలు, బైకు ర్యాలీలు, స్ట్రీట్ మీటింగ్‌లు ఉంటాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. డిండిలో నాగం వర్షిత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

చెరువులను వెంటనే నింపాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



దామరచర్లలో ఎండిపోయిన చెరువును పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 25: నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ఉన్న చెరువులు, కుంటలను వెంటనే నింపాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని చెరువులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎడమకాల్వ కింద ఉన్న చెరువులు, కుంటలను నింపి తాగునీటి ఎద్దడిని నివారించాలన్నారు. ఎడమకాల్వ పరిధిలో చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయన్నారు. మంచినీటి బోర్లు ఎండిపోవడంతో ప్రజలకు తాగునీటి ఎద్దడి ప్రారంభమైందన్నారు. తాగునీటికోసం ప్రజలు సుదూర ప్రాంతాలనుంచి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు రైతులు బోర్లు, బావుల కింద వరిసాగు చేపట్టగా పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. అదేవిధంగా సాగర్ ఎడమకాల్వ ద్వారా చెరువులను నింపి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు వినోద్‌నాయక్, నాయకులు పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, సుబాని, గోపి, వెంకట్‌రెడ్డి, విజయ్, రవి, బాలు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చిట్యాల: భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య కోరారు. ఆదివారం చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో ఎండిన వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలులేక బోరుబావులు ఎండిపోయి రైతుల పంటలు ఎండిపోతున్నాయన్నారు. కార్యక్రమలో బొబ్బల సుధాకర్‌రెడ్డి, ఐతరాజు నర్సింహ, శీలా రాజయ్య, గుండాల యాదయ్య, బొబ్బల వెంకట్‌రెడ్డి, గోకుల సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఆశలు ఆవిరై

» నిలువునా ఎండుతున్న పంటలు » చుక్క నీరు లేని బావులు, బోర్లు » ఆందోళనలో రైతులు



ఈ రైతు పేరు కాట్నం జానయ్య. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని బెజ్జికల్ గ్రామానికి చెందిన రైతు, నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. రెండున్నర నెలలయింది.. పంట ఏపుగా పెరిగింది. పొట్ట దశ దాటి కంకులు బయటకు కనిపిస్తున్నాయి. మరో నెల రోజులయితే పంట చేతి కొస్తుంది. ఉన్న బావి, బోరు రెండు ఒక్కసారిగా ఎండిపోయాయి. నీరు లేక పచ్చనిపొలం కాస్త ఎండు గడ్డిలా మారింది. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు.ఏమి చేయాలో తెలియక, దిక్కుతోచని దుస్థితిలో కన్నీటి పర్యంతమయ్యాడు. మరో రైతు శ్రీను సాగు చేసిన ఐదు ఎకరాలు ఆనవాళ్లు లేకుండా పోయింది. మూడు బోర్లు, బావి అడుగంటాయి. పంటను కాపాడుకోవడానికి పొలంలోని కొత్తగా బోరు వేసి మోటారు బిగిస్తే చుక్క నీరు రాలేదు. సుమారు రూ.2లక్షల వరకు నష్టపోయాడు. బెజ్జికల్ శివారులోని దాదాపు 300 నుంచి 400 ఎకరాలు ఎండిపోయాయి. కొంత మంది రైతులు ఎండిన పొలాల్లో పశువులను మేపుతున్న దృశ్యాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని రైతన్న దుస్థితి ఇది. చాలా ప్రాంతాల్లో వరి పంటలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి.



త్రిపురారంలో కొత్తగా బోరు వేస్తున్న రైతులు

త్రిపురారం, ఫిబ్రవరి 25: సాగర్ ఆయకట్టులో ఆరున్నర లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగయ్యేది. నీటి విడుదల లేక పోవడంతో బోరు బావు ల ఆధారంగా 20శాతం మాత్రం వరి సాగయింది. ఖరీఫ్‌లో రెండు, మూడు వర్షాలు పడటంతోపాటు కా ల్వ నీటిని విడుదల చేయడంతో పంటలో మంచి దిగుబడులు సాధించారు. రబీలో అదేస్థాయిలో వరి సాగు చేపట్టారు. నారు పోసిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వర్షం పడలేదు. నీటి లభ్యత లేక రైతులు వేల కొద్ది బోర్లు వేశారు. పెద్దగా ప్రయోజనం మాత్రం లేకుండా పోయింది. 20ఏళ్లలో బావులు పూర్తి స్థాయిలో ఎండిపోవడం ఇది రెండో సారి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి మొదటివారంలో సాగు చేసిన వరి చేతికొచ్చే దశలో ఉండగా మూడో వారంలో సాగు చేసిన పంట మరో నెల సమయం ఉంది. ఈ దశలో పంటలకు నీటి అవసరం చాలా అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిరంతరం బోర్లు వేస్తూ చుక్క నీటికోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నా.. దుమ్ము తప్ప చుక్క నీరు మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాంతంలో 50 అడుగుల నుంచి 200 అడుగుల వరకు నీటి లభ్యత ఉంటుంది. తర్వాత ఎంత లోతు వేసినా ఫలితం ఉండదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం నీటి వినియోగం అధికం కావడంతో బోర్లు అడుగంటడంతో రబీలో రైతన్నకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





చుక్క నీరు పోయని కొత్తగా వేసిన బోరు, ఎండిన బావి

ఇంత కరువు ఎన్నడు చూడలే..



ఆయకట్టులో ఇంత కరువు ఎన్నడూ చూడలేదు. వర్షాలు లేక పోవడం, నీటి వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో పూర్తిస్థాయిలో భూగర్భజలాలు పడిపోయాయి.. పోయిన ఏడాది వరకు నీరు సమృద్ధిగా ఉన్న ఏడాదిలోనే ఇంత కరువు ఛాయలు ఏర్పడటంతో పంటల సాగు ప్రమాదంలో పడింది. భూగర్భజలాలు పరిరక్షించుకోకపోతే భవిష్యత్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.

- మధు, రైతు, త్రిపురారం మండలం

అడుగంటుతున్న భూగర్భజలాలు



ఆకారం గ్రామంలో ఎండిన పొలాల్లో గొర్రెలను మేపుతున్న రైతులు

శాలిగౌరారం: వేసవి రాకముందే ఈసారి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో పొలాలు ఎండిపోవడంతో గత్యంతరంలేక రైతులు గొర్రెలు, పశువులను మేపుతున్నారు. ఈసారి వర్షాలు సరిగా కురవకపోవడంతో అంతంత మాత్రమే వరిపొలాలను బోరు బావుల, వ్యవసాయం బావుల వద్ద సేద్యంచేశారు. ముఖ్యంగా నాన్ ఆయకట్టు ప్రాంతాలైన భైరవునిబండ, తక్కళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాల్లో పూర్తిగా కరువుఛాయలు అలుముకున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టులో ఈ సీజన్‌కూడా సరిపడా నీరురాలేదు. ఈ ఆయకట్టులో 5వేల ఎకరాల్లో సేద్యం చేయాల్సి ఉండగా కేవలం వెయ్యి ఎకరాల్లో కూడా సేద్యం కావడం లేదు. ప్రాజెక్టు ఆయకట్టులో కూడా నీరందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సేద్యం చేసిన పంటలు నిట్ట నిలువునా ఎండి పోతున్నందున వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

యాదగిరీశా.. నీవే దిక్కు!

● వేసవికి ముందే దంచుతున్న ఎండలు
● కొండపై ఏర్పాట్లు చేయాలని భక్తుల వినతి

ఎంతో భక్తితో యాదగిరీశుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. వేసవి ప్రారంభానికి ముందే గొడుగులు వెంట తెచ్చుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపై సరైన వసతులు కల్పించకపోవడంతో, కాళ్లు కాలి.. మాడ మండుతోందని.. దర్శనానికి ముందే దేవుడు కన్పిస్తున్నాడని చెబుతున్నారు.

6



కొండపై ఎండలో గొడుగు నీడలో భక్తురాళ్లు

యాదగిరీశా.. నీవే దిక్కు

- వేసవికి ముందే మండుతున్న ఎండలు
- యాదగిరి క్షేత్రంలో 37డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- కార్పెట్‌లు, మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్న భక్తులు

యాదాద్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవి ఆరంభం కాక ముందే యాదగిరిగుట్టలో ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఎండా కాలం మార్చి నెలాఖరు నుంచి మే చివరి వరకు ఉంటుంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం వేళ మబ్బులు కమ్మినట్టుగా ఉన్నటువంటి వాతావరణం తొమ్మిది గంటలు కాగానే ఎండలు ప్రారంభమవుతున్నాయి. వారం రోజులుగా యాదగిరిగుట్ట మండలంలో గరిష్ఠ ఉష్ణోత్రలు 36డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఈ నెల 22న 37.6డిగ్రీలు, 23న 36.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహిమాన్విత స్వయంభూ యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామివారి ప్రధానాలయంతో పాటు ప్రాంగణమంతా కూడా కృష్ణరాతి శిలలతో నిర్మించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఆలయ ప్రాంగణంలో రాతి శిలల వేడికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపైన ఉక్కపోత, ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫిబ్రవరిలోనే ఇలాంటి పిరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కొండపై చలువ పందిళ్లు మార్చి నెలలోనే వేయాలని కోరుతున్నారు. భక్తులు దర్శన క్యూకాంప్లెక్స్‌ల నుంచి ప్రధానాలయ తూర్పు రాజగోపురం ద్వారా గర్భాలయంలోకి ప్రవేశిస్తున్నారు. క్యూకాంప్లెక్స్‌లో, ప్రధానాలయంలో ఉన్నంత వరకు ఎండల నుంచి భక్తులు ఉపశమనం పొందుతున్నారు. గర్భగుడిలో స్వామివారి దర్శనాంతరం పశ్చిమం వైపు ఉన్న సప్తతల మహారాజగోపురం, వేంచేపు మండపం నుంచి భక్తులు బయటకు రావాలి. అయితే ఆలయ ప్రాంగణమంతా రాతిబండలు ఉండటంతో ఎండకు అవి వేడెక్కుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని తిరువీధుల్లో మ్యాట్‌లు లేకపోవడంతో ఎండలకు రాతిబండలపై నడవలేక ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. కొండపైన బస్టాండ్ వరకు కాలినడకన వెళ్లాలంటే భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొండపైన భక్తులు నడిచేందుకు వైట్ పెయింట్ ఏర్పాటుచేశారు. అయితే భక్తులు తిరువీధుల్లో రాతిబండలపై నుంచి పాదరక్షకులు లేకుండా వైట్ పెయింట్‌పై నడవాలంటే తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. స్వామిదర్శనం అనంతరం శివాలయం పక్కన ఉన్నటుంటి ప్రసాదాల కౌంటర్‌కు, ప్రసాదాలను తీసుకుని బస్టాండ్‌కు చేరుకోవాలి. అయితే ఎండల నుంచి ఉపశమనం పొందేలా ఆలయ అధికారులు చలువ పందిళ్లు...మ్యాట్‌లను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానాలయం ప్రాంగణంతో పాటు కొండకింద బస్టాండ్ వరకు కార్పెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వీఐపీ టిక్కెట్ తీసుకుని దర్శనానికి వచ్చే భక్తుల కోసం తాత్కాలికంగా చలువపందిళ్లు ఏర్పాటుచేయగా, శివాలయం నుంచి బస్టాండ్ వరకు చలువపందిళ్లు ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు.


యాదగిరిగుట్టలో కొండపైన వీఐపీ దర్శనం కోసం విచ్చేసే భక్తుల కోసం ఏర్పాటుచేసిన చలువపందిళ్లు


పాతగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన చలువపందిళ్లు

మార్చి 11నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు షురూ..

భక్తజన బాంధవుడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు మార్చి 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం నాటికైనా కొండపైన ఎండలకు ఉపశమనం పొందేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ముక్కోటి దేవతలు ఆహూతులుగా లోకకల్యాణం.. విశ్వశాంతి కోసం అంగరంగవైభవంగా 11రోజుల పాటు జరిగే లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మార్చి 11న స్వస్తివాచనంతో ప్రారంభమై.. 21న అష్టోత్తర శతఘటాభిషేకం..శృంగార డోలోత్సవంతో పరిసమాప్తమవుతాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లను చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు



వేసవిలో భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. కొండపైన వైట్ పెయింట్‌తో పాటు కార్పెట్లు కూడా ఏర్పాటు చేయనున్నాం. వీఐపీ దర్శనాల కోసం విచ్చేసే భక్తుల కోసం చలువపందిళ్లు ఏర్పాటుచేస్తున్నాం. కొండపైన శివాలయం ముందుకు భక్తులు నడిచే దారిలో చలువపందిళ్లు వేయనున్నాం. అవసరమైతే కార్పెట్‌లు కూడా ఏర్పాటు చేస్తాం. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం. అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్‌లు అందుబాటులో ఉంచుతాం.

- రామకృష్ణారావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో

ప్రియుడితో కలిసి భర్త హత్య

- గుండెపోటుగా చిత్రీకరించే యత్నం
- భార్య అరెస్టు, పరారీలో ప్రియుడు
- సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఘటన

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 25 : ప్రియుడితో ఏకాంతంగా ఉండగా చూసిన భర్తను హత్య చేసి గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులను నమ్మించింది. అంత్యక్రియల సమయంలో మృతదేహంపై గాయాలను చూసిన బంధువులు భార్యను నిలదీయడంతో ఆమె బండారం బయటపడింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. మేళ్లచెర్వు ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నేర్నకంటి వీరగోపయ్య(32)కు కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన వీరకుమారితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమార్తె వినీత, మూడేళ్ల కుమారుడు వినయ్‌కుమార్ ఉన్నారు. వీరకుమారికి గ్రామానికి చెందిన వార్డు మెంబరు భర్త ఎస్‌కే సైదాహుస్సేన్‌తో మూడేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. కుటుంబసభ్యులు పలుమార్లు మందలించినా ఆమెలో మార్పు రాలేదు. శనివారం వీరగోపయ్య ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో వీరకుమారి ప్రియుడు సైదాహుస్సేన్‌తో ఏకాంతంగా ఉంది. ఈ విషయం బయటకు తెలుస్తుందని ప్రియుడితో కలిసి భర్తపై దాడి చేసింది. వీరగోపయ్య కాళ్లను ప్రియుడు సైదాహుస్సేన్ పట్టుకోగా ముఖంపై దిండు అదిమి పట్టుకుని ఊపిరాడకుండా చేసి భర్తను హత్య చేసింది. భర్త గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడని బంధువులను నమ్మించింది. ఆదివారం సాయంత్రం అంత్యక్రియల ఏర్పాట్లలో భాగంగా వీరగోపయ్య మృతదేహానికి స్నానం చేయించడానికి చొక్కాను తీయగా శరీరంపై గాయాలు కనిపించాయి. అతడి బంధువులు వీరకుమారిపై దాడి చేసి గట్టిగా నిలదీయడంతో ప్రియుడి సాయంతో భర్తను హత్య చేశానని అంగీకరించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వీరకుమారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరగోపయ్య అక్కలు నాగలక్ష్మి, రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రియుడు పరారీలో ఉన్నాడని చెప్పారు.



వీరగోపయ్య(ఫైల్ ఫొటో)

అందాల అనుపు

● గౌతమ బుద్ధుడి చరిత్రకు సజీవ సాక్ష్యం ● కళ్లను కట్టిపడేసే ప్రకృతి సోయగం ● నాగార్జునసాగర్ నుంచి 10 కి.మీల దూరం

ఓవైపు ఎత్తయిన కొండలు.. మరోవైపు గలగలపారే కృష్ణమ్మ.. ఇంకోవైపు పచ్చదనంతో ఆకట్టుకునే పార్కులు.. ఇవన్నీ నాగార్జునసాగర్ పరిధిలోని అనుపు సొంతం. గౌతమ బుద్ధుడి కాలం నాటి చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపే నిర్మాణాలు.. ఆచార్య నాగార్జునుడి చరిత్రను గుర్తుకు తెచ్చే కట్టడాలు చూడముచ్చటగొలుపుతున్నాయి. ప్రకృతి సోయగాలు, కృష్ణవేణి నీటి సవ్వడితో, పచ్చటి పచ్చిక బయళ్ల నడుమ చల్లటి గాలులలతో అలరారుతూ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది.

● నాగార్జునసాగర్



దేశ విదేశాలనుంచి పర్యాటకులు అనుపును సందర్శించడానికి ఏటా వేల సంఖ్యలో వస్తుంటారు. 2006లో అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళుతూ బౌద్ధ మత గురువు దలైలామా అనుపులో ఓ మొక్కను కూడా నాటారు. దీంతో నాటినుంచి వివిధ దేశాల నుంచి వచ్చే బౌద్ధ పర్యాటకులు నాడు దలైలామా నాటిన మొక్కను సందర్శిస్తుంటారు. అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతున్న అనుపు గురించి అందిస్తున్న ప్రత్యేక కథనం..

బౌద్ధమతానికి కేంద్ర బిందువు గౌతమ బుద్ధుడు. ఆయనకు సంబంధించిన ఎన్నో అనవాళ్లు నాగార్జునసాగర్‌లోనే చోటుచేసుకున్నట్లు చరిత్ర చెబుతోంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంకోసం సర్వేలు చేశారు. 1956వ సంవత్సరానికి ముందు వరకు కృష్ణానది ప్రవహిస్తున్నా చుట్టుపక్కల మొత్తం దట్టమైన నల్లమల అటవి ప్రాంతంతో నిండి ఉండేది. నాటి ప్రధాని నెహ్రూ 1955లో నందికొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఇక్కడే బాగుంటుందని ఎంపిక చేశారు. గౌతమ బుద్ధుని అనవాళ్లకు నెలవైన ఈ ప్రాంతంలోనే ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో పలుచోట్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం తవ్వకాలు జరిపారు. తవ్వకాల్లో గౌతమ బుద్ధుడి కాలం నాటి చరిత్రకు అద్దంపట్టే పలు వస్తువులను, బుద్ధుడి పాలరాతి విగ్రహాలను, ధాతువులు, పలు రకాల లోహపు వస్తువులు బయటపడ్డాయి. వీటిని భద్రపరిచేందుకు నాటి ప్రభుత్వం అనుపు నుంచి 14 కి.మీల. దూరంలో ఉన్న (ప్రస్తుతం జలాశయంలో ఉంది) నాగార్జునకొండ, అనుపులను ఎంపిక చేశారు. నాగార్జునకొండలో ప్రత్యేకంగా మ్యూజియాన్ని ఏర్పాటుచేసి నాటి చరిత్రకు అద్దంపట్టేలా ఉన్న వస్తువులను మ్యూజియంలో భద్రపరిచి ప్రత్యేకభద్రతను ఏర్పాటుచేశారు. మ్యూజియంలో బౌద్ధ కాలంనాటి పలు వస్తువులను, శిల్ప సంపద, నేటి తరానికి నాటి చరిత్ర అర్థమయ్యేలా పలు నిర్మాణాలు ఇక్కడ కనిపిస్తాయి. ఇక అనుపు ప్రాంతాన్ని పరిశీలిస్తే ఇక్కడ బుద్ధుని కాలంనాటి విద్యా వ్యవస్థను వివరించే విశ్వవిద్యాలయాన్ని పునర్నిర్మాణం చేశారు. అలనాటి క్రీడాప్రాంగణం, వసతిగృహాలు, ఆధ్యాత్మికంగా ఉండే విహారాలు, బౌద్ధమతం ప్రచారం, అప్పటి నిర్మాణాలు కళ్లను కట్టిపడేస్తుంటాయి. నాగార్జునసాగర్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో అనుపు అనే ప్రాంతం ఉంది.


అనుపు వద్ద పచ్చని కొండలు

బౌద్ధ మత కట్టడాలు

కళ్లకు కట్టిపడేసే ప్రకృతి సోయగం

అనుపు వద్ద ప్రకృతి సోయగం కళ్లకు కట్టిపడేస్తుంది. ఇక్కడ సుందర దృశ్యాలు కనువిందు చేస్తాయి. పురావస్తు శాఖ అభివృద్ధి చేసిన పునర్నిర్మిత కట్టడాలు, దానిచుట్టూ పెంచిన పచ్చదనం, ఎత్తయిన కొండలు, దూరంగా కనిపించే కృష్ణాతీరం, అద్భుతంగా ఉంటుంది. ఇక్కడ నాడు నిర్మించిన హంపీ స్టేడియం నమూనాలో నేటి ఎల్‌బీ స్టేడియాన్ని నిర్మించారు. హంపీ స్టేడియంలో నాడు మల్లయుద్ధాలు, ముష్టియుద్ధాలు జరిగేవని చరిత్ర చెబుతోంది. సాగర్‌కు వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా అనుపును సందర్శిస్తుంటారు.

వివిధ రూట్ల నుంచి చేరుకోండిలా..

హైదరాబాద్ నుంచి 160 కిలోమీటర్ల దూరంలో అనుపు ఉంటుంది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన వారి నాగార్జునసాగర్‌లోని రైట్‌బ్యాంక్ జంక్షన్ వద్ద దిగి.. అక్కడి నుంచి ఆటోల్లో 10 కి.మీ. దూరంలో అనుపునకు చేరుకోవచ్చు. గుంటూరు నుంచి 150 కి.మీ.ల దూరంలో నాగార్జునసాగర్ ఉంటుంది. గుంటూరు నుంచి బయలుదేరిన వారు 130 కి.మీ.ల దూరంలో మాచర్లకు చేరుకొని.. అక్కడి నుంచి 20 కి.మీ.ల దూరంలో నాగార్జునసాగర్‌సాగర్‌కు చేరుకున్నాక.. రైట్‌బ్యాంక్ జంక్షన్ వద్ద దిగి.. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాల్లో 10 కి.మీ. దూరంలో ఉన్న అనుపునకు చేరుకోవాలి. నల్లగొండ నుంచి 60 కి.మీల దూరంలో ఉన్న సాగర్‌కు వయా హాలియా నుంచి రావాలి. సాగర్‌కు చేరుకున్నాక, అనుపునకు వెళ్లాలి. గుంటూరు నుంచి నాగార్జునసాగర్‌కు మూడున్నర గంటల ప్రయాణానికి రూ.220, హైదరాబాద్ నుంచి మూడున్నర గంటల ప్రయాణానికి నాగార్జునసాగర్‌కు రూ.250, నల్లగొండ నుంచి రెండు గంటల ప్రయాణానికి రూ.80గా ఆర్టీసీ బస్‌చార్జీలు వసూలు చేస్తుంది.

పాతగుట్ట బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం


పాతగుట్ట యాగశాలలో పూర్ణాహుతి పర్వాలను నిర్వహిస్తున్న అర్చకులు

● కల్యాణ లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25: పాతగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవ విశేష ఘట్టాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో ఆసాంతం భక్తజనులను కటాక్షించేందుకు వివిధ వాహన సేవల్లో అనుగ్రహించిన లక్ష్మీనరసింహుడిని వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శత కలశాలతో అభిషేకించారు. పాతగుట్ట ముఖమండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసిన అర్చకులు కలశాలలో గంగాధి సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపి దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజలతో పుణ్యాహవాచనం చేపట్టి, యాగశాలలో నిత్య లఘు పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు, రుత్వికులు పంచసూక్తం, దశశాంతులు, నారాయణ సూక్తాలు, పంచోపనిషత్తుల పఠనాలు..ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ పాతగుట్ట ప్రధానాలయంలోని స్వయంభువులను, కవచమూర్తులను, ఉత్సవమూర్తులను అష్టోత్తర శత కలశాలతో అభిషేకించారు. తులసి, వివిధ రకాల పూలతో అభిషేక మూర్తులను స్వామి, అమ్మవార్ల సహస్రనామాలతో అర్చించారు. ఈ వైశేషిక బ్రహ్మోత్సవ ఘట్టాలను శ్రీవైష్ణవ పాంచరాత్రగమ శాస్త్రరీతిలో ప్రధానార్చకులు నల్లన్‌ధిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చక, రుత్విక బృందం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో చతుర్వేద, దివ్యప్రబంధ, క్షేత్రమహత్యా పారాయణాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, హోమపూజలు నిర్వహించిన రుత్వికస్వాములను అష్టోత్తర శతఘటాభిషేక పూజలనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావులు ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి నిత్య మొక్కుకల్యాణాలు

పాతగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు స్వామివారి మొక్కు, శాశ్వత నిత్యకల్యాణాలు, పలు ఆర్జిత సేవలను దేవస్థాన అధికారులు నిలిపివేశారు. ఆదివారం అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దీంతో సోమవారం నుంచి తిరిగి భక్తులు నిర్వహించుకునే శాశ్వత, మొక్కు నిత్యకల్యాణాలు, ఆర్జిత సేవా కైంకర్యాలు ఆరంభం కానున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.


ప్రధానాలయంలో దేవదేవుడి దర్శనాల కోసం వేచిఉన్న భక్తులు

యాత్రాజనుల సందడి

యాదగిరిగట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం యాత్రాజనుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా దేవదేవుడి దర్శనాల కోసం తరలివచ్చారు. మేడారం మహాజాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో యాదగిరీశుడిని దర్శించుకోవడం ఆనవాయితీ వస్తున్న ఆచారం. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన భక్తజనుల హరిహరుల నామస్మరనలతో క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. ఆలయ తిరువీధులు, ఆర్జిత సేవా మండపాలు భక్తనులతో కోలాహలంగా కనిపించాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల విక్రయశాల వద్ద క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కొండకింద కల్యాణకట్టలో మొక్కుతలనీలాలు సమర్పించిన యాత్రీకులు లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి కొండపైకి స్వామివారి దర్శనాల కోసం ఉచిత బస్సులు, తమతమ వాహనాల్లో తరలివచ్చారు. ఉభయ దర్శనాల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచివుండి కొండగుహలో కొలువైన ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ధర్మ దర్శనాలలో సుమారు 4గంటలు..ప్రత్యేక దర్శనాలలో 2గంటల సమయం పట్టిందని, సుమారు 35వేల మందికి పైగా భక్తులు ఆలయాన్ని సందర్శించినట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.48,96,311 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామికి శాస్త్రోక్తంగా నిత్యారాధనలు


కొండపైన లక్ష్మీనృసింహులు నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరివాసుడికి ఆదివారం నిత్యారాధనలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, ప్రతిష్టా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసి దళాలతో అర్చనలు జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో విశ్వక్సేనుడికి తొలి పూజలతో సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో వైభవంగా కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో నిర్వహించారు.

స్వామివారి సేవలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

యాదగిరీశుడిని ఆదివారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. ప్రాకార మండపంలో అర్చకులు ఆయనకు ఆశీర్వచనం జరపగా..దేవస్థాన అధికారులు ఆయనకు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షికబ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడసేవ నిర్వహించారు. ఉదయం ఆలయ మహామంటపంలో హోమం, బలిహారణం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను ఆలయ వీధుల్లో ఊరేగించారు. వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి,రాజేశ్వరి దంపతులు,సిబ్బంది సింహాచలం, వేణు, మత్స్యగిరి, నాగరాజు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కనగల్ : మండలంలోని పగిడిమర్రిలోని గోవిందాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు వడిబియ్యం, కట్నకానుకలను సమర్పించి మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి దంపతులు, గోలిజగాల్‌రెడ్డి దంపతులు వేర్వేరుగా పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్రమాద యశోదమ్మ, నాయకులు సుంకిరెడ్డి రవీందర్‌రెడ్డి, సింగం సత్తయ్య, వెంకట్‌రెడ్డి, మల్లేష్, సైదులు, వెంకన్న, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహా, రవీందర్, కృష్ణారెడ్డి, షణ్ముఖాచారి, భూషణాచారి, నర్సింహాచారి పాల్గొన్నారు.


పగిడిమర్రిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మారేపల్లిలో వేంకటేశ్వరస్వామి..

హాలియా : మండలంలోని మారేపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి తిరుకల్యాణాన్ని కన్నులపండుగా నిర్వహించారు. అదేవిధంగా తలంబ్రాలు, గజవాహన సేవ, ఆరగింపు, తీర్థప్రసాద వినియోగం, గరుడ సేవ, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట మాజీ ప్రధాన అర్చకులు కారంపూడి లక్ష్మీనర్సింహాచార్యులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం గ్రామపురవీధుల్లో కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అనుముల మండల వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి, దేవాలయ అధికారి అంబటి నాగిరెడ్డి, చైర్మన్ మట్టపల్లి వెంకన్న, గంగుల వెంకన్న, శ్రీకాంత్, బర్పటి సరిత, శ్రీను, మెండే ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, అశోక్, చక్రపాణి పాల్గొన్నారు.


మారేపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

చిట్యాల రూరల్ : మండలంలోని బొంగోనిచెర్వు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గణపతి, నంది, జంట నాగులు, నవగ్రహ విగ్రహా ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా విగ్రహాలు, ఆలయాల దాతలు వెలిమినేటి నర్సిరెడ్డి, పన్నాల నీరజ, మహేందర్‌రెడ్డి, వెలిమినేటి సబిత, బుచ్చిరెడ్డి, కళమ్మ, బొబ్బలి స్వర్ణలత, వెంకటేశ్వర్‌రెడ్డిలను పూజారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామిడి సాయికుమార్, సామిడి మోహన్‌రెడ్డి, ఏనుగు గోపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఎంపల్ల పద్మ, రమణమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

అడవిదేవులపల్లి: మండలంలోని చిట్యాల గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంకాల కాశయ్య, నాగేశ్వర్‌రావు, గోపి, నాగేశ్వర్‌రావు, ఏడుకొండలు పాల్గొన్నారు

కుంభాభిషేకం

దేవరకొండ / చందంపేట : పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ద్వితీయ పుష్కర కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ చందంపేట మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, నాయకులు నీల రవికుమార్, బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, రమావత్ మోహన్‌కృష్ణ, గోసుల అనంతగిరి, కేతావత్ శంకర్‌నాయక్, రమావత్ తులసిరాం, బొడ్డుపల్లి కృష్ణ, సత్యనారాయణ, వడ్య బాలు, రవి, సైదులు, అంజి, రాంరెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు. అదేవిధంగా చందంపేట మండలం పెద్దమూల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొన్నారు

కిటకిటలాడిన నార్కట్‌పల్లి బస్టాండ్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. మేడారం జాతరకు బస్సు సర్వీసులను పంపించారు. దీంతో బస్సుల కొరతతో బస్‌స్టేషన్‌కు ఏ రూట్ నుంచి వచ్చిన బస్సైనా ప్రయాణికులతో కిక్కిసిరి కనిపించాయి. ఏబస్సులో చూసినా 90 శాతం మంది మహిళా ప్రయాణికులే ఉన్నారు. ఆదివారం సెలవురోజు కావడం శుభకార్యాలు ఎక్కు వగా ఉండటంతో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. చంటిపిల్లలు, చేతి సంచులు, బ్యాగులతో మహిళలు బస్సులు ఎక్కలేక, గమ్యస్థానాల్లో దిగలేక నానాఅగచాట్లు పడ్డారు. నార్కట్‌పల్లి బస్టాండ్ నుంచి నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్, భువనగిరి రూట్లలో వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసాయి. బస్సు ఫుట్ బోర్డు వరకు నిలబడి వేలాడుతూ ప్రమాదం అంచున ప్రయాణించారు. ఇదిలా ఉండగా ప్రైవేటు వాహనాల్లో వెళ్దామనుకున్నా అవీ కూడా అందుబాటులో లేక పోవడంతో ప్రయాణికులతో నార్కట్‌పల్లి బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది.


బస్సు ఎక్కుతున్న మహిళలు


ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

ప్రాణాంతకమైన ఫార్మా కంపెనీ మాకొద్దు

● ఉన్న పరిశ్రమలతో అనేక ఇబ్బందులు


సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో ఇన్నోవేరా పరిశ్రమకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న దొండపాడు గ్రామస్థులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 25: ప్రాణాంతకమైన విషవాయువులు వెదజల్లే ఇన్నోవేరా ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామస్థులు నిరసన తెలిపారు. దొండపాడు గ్రామంలో రూ.400 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఇన్నోవేరా ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ఆ గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ2019 సంవత్సరంలో ఎస్‌డీఆర్, ఎస్‌ఆర్‌ఆర్ ఫార్మా కంపెనీ నిర్మించాలనుకున్నప్పటికీ, ఆ ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్థులందరం నిరసన తెలిపాన్నారు.దాంతో ఆ కంపెనీ వెనక్కి వెళ్లిందని, మళ్లీ ఇప్పుడు కొత్తగా అదే స్థలంలో స్థానికులకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ నిర్వహించకుండా ఈ కంపెనీకి మంత్రులు ఎలా శంకుస్థాపన చేస్తారని నిలదీశారు. సిమెంట్ కంపెనీలు, ఫార్మా కంపెనీలతో ఆ ప్రాంతంలో గాలి, నీరు కలుషితమైందని, ఇప్పుడు కొత్తగా నిర్మించే ఫార్మా కంపెనీతో గ్రామానికి మరింత హాని జరుగుతుందన్నారు. ఈ కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్థులందరం కలిసి కట్టుగా ఉద్యమం చేస్తామని, ప్రజారోగ్యానికి హాని కలిగించే పరిశ్రమలు తమకు వద్దని ముక్తకంఠంతో నినదించారు. కార్యక్రమంలో దొండపాడు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి ఎంపికతో జర్నలిస్టులకు న్యాయం

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25: రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఎంపికతో రాష్ట్రంలోని జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షులు కోలా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడిగా, పత్రిక సంపాదకుడిగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి గతంలో ప్రెస్ అకాడమి చైర్మన్‌గా పనిచేసి, రెండోసారి చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్.నరేందర్, బసవోజు శ్రీనివాసాచారి, ధేనమకొండ శేషంరాజు, కీతా రామనాథం, పిల్లలమర్రి శ్రీనివాస్, దేవరం రామిరెడ్డి, వెంకటరెడ్డి, జానీబాషా, ఇందిరాల రామకృష్ణ, ఇట్టిమళ్ల రామకృష్ణ, షేక్ నాగుల్‌మీరా, ఆర్పీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ప్రెస్ అకాడమి చైర్మన్‌గా ఐజేయూ నాయకుడు శ్రీనివాసరెడ్డిని నియమించడంపై టీయూడబ్ల్యూజే నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ విలేకరుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దొంతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు టీఎన్‌స్వామి, కోశాధికారి గుంటూరు రాము, నాయకులు గోపాలకృష్ణ, బుడిగె శంకర్, చామకూరి వీరయ్య, ఈగ శ్రీనివాసరావు, అలుక సైదిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

సూర్యాపేట టౌన్: తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నాయకులు జిల్లా కేంద్రంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు, మిక్కిలినేని శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ, బత్తుల మల్లికార్జున్, కొండ శ్రీనివాసరావు, ఉయ్యాల నర్సయ్య, జహీర్, నజీర్, మల్లేష్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక కావడంపై తుంగతుర్తి టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.రవీందర్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు.


హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న కోల నాగేశ్వరరావు

డీఆర్‌డీఏలో ఉద్యోగినిపై వేధింపులు

● కలెక్టర్‌కు పిర్యాదు ● విచారణకు ఆదేశం

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: సూర్యాపేట జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ)లో ఉద్యోగినిపై సంబంధిత శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డీఆర్‌డీఏలో సోషల్ ఆడిట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినిని డీఆర్‌డీఏలో హెచ్‌ఆర్ విభాగంలో కీలక స్థానంలో విధులు నిర్వహిస్తున్న అధికారి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. గతంలో కూడా సంబంధిత మహిళా ఉద్యోగినిని సదరు అధికారి వేధింపులకు గురిచేయగా, ఆ సమయంలో ఆ ఉద్యోగిని, సంబంధిత శాఖ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలివేసినట్లు తెలిసింది. ఇటీవల ఆ మహిళా ఉద్యోగినిపై మరోసారి వేధింపులు, అసభ్య పదజాలంతో మాట్లాడడం తో ఆ ఉద్యోగిని కలెక్టర్ వెంకట్రావ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక అంద జేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి వెంకట రమణను కలెక్టర్ ఆదేశించారు.

బూరుగడ్డ గ్రామంలో ఇంట్లో చోరీ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 25: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఆర్‌ఎంపీ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రాంబాబు అనారోగ్యం బారిన పడటంతో మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రాంబాబు, భార్యతో ఆదివారం ఇంటికి రాగా, ఇంటి తలుపులు, బీరువా ధ్వంసం చేసి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.13లక్షలు చోరీకి గురయ్యాయని రాంబాబు భార్య మమత పోలీసులకు ఫిర్యాదు చేఉసింది. సీఐ చలమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్ఞానీస్ యోగశాల విద్యార్థులు ప్రతిభ

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 25: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఆదివారం జరిగిన స్టేట్ లెవెల్ సూర్య నమస్కార పోటీల్లో ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన జ్ఞానీస్ యోగశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 1000 సూర్య నమస్కార పోటీల్లో గూడూరు నాగేశ్వర్‌రావు మొదటి బహుమతి, 900 సూర్యనమస్కార పోటీల్లో దేశగాని ఉప్పలయ్య తృతీయ బహుమతి, 108 సూర్య నమస్కార పోటీల్లో ముదిరెడ్డి నరేందర్‌రెడ్డి, నారాయణ సురేష్‌రెడ్డి, మొలుగూరు సోమశేఖర్, గట్టి గొర్ల మధుబాబు బంగారు పతకాలు సాధించారు. విజేతలకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఇన్‌చార్జి గోవర్ధన్‌గిరి, ఎంవీ రంగారావు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను జిల్లా కేంద్రానికి చెందిన పలువురు అభినందించారు.

క్రైం పాయింట్
Crime point

నిలిచి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

అక్కడికక్కడే వ్యక్తి మృతి.. నలుగురికి గాయాలు



ట్యాంకర్ కిందకు దూసుకెళ్లిన కారు, మృతుడు బాలయ్య(ఫైల్)

కట్టంగూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్యాంకర్‌ను అతివేగంతో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్(ఎల్‌బీనగర్) అలకాపురి కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోవింద్ బాలయ్య(50) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున ఏపీ28డీఏన్ 9972 కారులో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ఎర్రవరం లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి బయలుదేరారు. తమ్ముడి కుమార్తెకు అనారోగ్యంగా ఉండటంతో దేవాలయానికి వెళ్తున్నారు. ఇందుకోసం అపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన కారుకు బాలయ్య ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన, డ్రైవర్‌గా పనిచేస్తున్న లింగస్వామి వెంటవచ్చాడు. బాలయ్య ముందు సీట్లో కూర్చోగా, లింగస్వామి వాహనం నడుపుతున్నాడు. బాలయ్య తమ్ముడు కుమార్తె చందన, లింగస్వామి కుమారుడు నమీష్, కుమార్తె అంకృతలు వెనుక కూర్చున్నారు. కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద అతివేగంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రహదారికి ఎడమవైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో హైవే పక్కన వాహనాల విశ్రాంతి ప్రదేశంలో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జయి బాలయ్య అక్కడికక్కడే మృతిచెందగా, వాహనం నడుపుతున్న లింగస్వామితో పాటు ఆయన కుమారుడు నమీష్, కుమార్తె అంకృత, ఆయన బాబాయ్ కుమార్తె చందనలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బాలయ్య మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలయ్య భార్య, కోడలు ఇంటి వద్దనే ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


సేనావత్ కమిలి(ఫైల్)

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 25: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం కారోబార్‌తండాలో విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి చెందింది. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం వద్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్‌తండాకు చెందిన సేనావత్ కమిలి(45) భర్త హేమ్లాతో కలిసి తమకున్న రెండు ఎకరాలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం తమ పొలంలో యూరియా చల్లేందుకు వెళ్లింది. గాలులకు తెగి పొలంలో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు కమిలి తలకు తగలడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి ఏడు గంటలైనా కమిలి ఇంకా ఇంటికి రాకపోవడంతో భర్త హేమ్లా గ్రామస్థులతో కలిసి వెతకగా, పొలంలో విగత జీవిగా కనిపించింది. కమిలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కమిలి భర్త హేమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

తిప్పర్తి, ఫిబ్రవరి 25 : గోవులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం వెంకటబాయితండా గ్రామానికి చెందిన జేర్పుల రాకేష్ విజయవాడలోని హనుమాన్ జంక్షన్ నుంచి టీఎస్07యుజీ 4858 నెంబరు గల డీసీఎంలో 45గోవులను హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తు న్నాడు. ఆదివారం ఉదయం మండలకేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ వాహనం పట్టుబడింది. ఆ వాహన్నాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి గోవులను చింతపల్లి మండల కేంద్రంలోని గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

25 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యం పట్టివేత

తిప్పర్తి, ఫిబ్రవరి 25: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం ఉదయం పట్టుబడి చేసి కేసు నమోదుచేశారు. ఏఎస్‌ఐ ఎస్‌ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన మొగిలి నాగరాజు తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామం నుంచి 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వాహనంలో నల్లగొండకు తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు మామిడాల క్రాస్ రోడ్డు వద్ద వాహనాన్ని పట్టుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ నాగరాజు, యజమాని మొగిలి ఉపేందర్‌లపై కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటికోల్‌లో 10 క్వింటాళ్లు..

నల్లగొండ : నకిరేకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చందన దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో తాటికోల్ గ్రామంలో సూరారపు పిచ్చయ్య ఇంట్లో అక్రమ నిల్వ ఉంచిన 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలులో నుండి పడి వ్యక్తి మృతి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 25: రైలులో నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ శ్రీరాంపురం రైల్వే స్టేషన్ల మధ్య 74వ కిలోమీటర్ వద్ద ట్రాక్ వెంట సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం ఉన్నట్లు ట్రాక్‌మన్ గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు గుర్తుతెలియని రైలు నుంచి కింద పడటంతో తలకు గాయలై మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్నుట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య, ప్రియుడు ఒకే గదిలో..

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 25 : భార్య, ప్రియుడు ఒకే గదిలో కలిసి ఉండగా భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన అడవిదేవులపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అడవిదేవులపల్లికి చెందిన మండల శంకర్‌తో నిడమనూరు మండలం వెనిగండ్లకు చెందిన మహిళకు 15 ఏళ్ల కిందట వివాహమైంది. మూడేళ్ల కిందట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పసుపులేటి శ్రీను, శంకర్ భార్యతో స్నేహంగా ఉంటూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటి నుంచి శంకర్‌కు, భార్యకు మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శ్రీను పలుమార్లు శంకర్‌పై హత్యాయత్నం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా తనను వేధిస్తున్నాడని శంకర్ భార్య గృహహింస చట్టం కింద శంకర్‌పై, కుటుంబసభ్యులపై కేసు పెట్టింది. శంకర్ భార్య తనకు దూరంగా అదే గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. అయితే శనివారం రాత్రి పసుపులేటి శ్రీను శంకర్ భార్యతో ఒకే గదిలో ఏకాంతంగా కలిసి ఉండడంతో వారిని శంకర్ కుటుంబసభ్యులతో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాగా ఇదే విషయమై ఎస్‌ఐ హరిబాబును వివరణ కోరగా రెండేళ్ల క్రితం నుంచి కోర్టులో శంకర్, అతడి భార్య మధ్య విడాకులు కేసు నడుస్తున్నందున తాము జోక్యం చేసుకోలేమన్నారు. ఏదైనా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. వారి మధ్య గొడవలు జరుగుతున్నందున పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించి పంపించామన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్‌కు భూములు ఇవ్వొద్దు

చిట్యాల రూరల్, ఫిబ్రవరి 25 : మండలంలోని వెలిమినేడు గ్రామంలోని సర్వే నెంబర్ 396, 418 సర్వే నెంబర్లలోని అసైన్డ్, పట్టా భూములను ఇండస్ట్రియల్ పార్క్‌కు అప్పగించవద్దని గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఎకరాకు రూ.21లక్షల నష్టపరిహారం ఇస్తామని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. భూసేకరణ జీవోను రద్దు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ద్వారా పరిస్థితిని సీఎంకు వివరించి భూసేకరణ ఆపుతామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సుర్కంటి సత్తిరెడ్డి, భూపోరాట సమితి అధ్యక్షుడు అంశల సత్యనారాయణ, సామ రాంరెడ్డి, సింగిరెడ్డి అనంతరెడ్డి, అరూరి శివ, పోలగోని శివప్రసాద్, అరూరి వెంకటేశ్వర్లు, శ్రీశైలం ప్రజాపతి తదితరులు ఉన్నారు.

లక్షలు వెచ్చించారు..లక్షణంగా వదిలేశారు


అక్కంపల్లి గ్రామంలో నిరుపయోగంగా మారిన కంపోస్ట్‌షెడ్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 25 : పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను సద్వినియోగం చేసుకోవడానికి కంపోస్ట్ షెడ్‌లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రభుత్వం లక్ష్యం మంచిదైనా ఆచరణలో ముందడుగు పడటంలేదు. అధికారులు సైతం నిధుల సద్వినియోగానికి ప్రయత్నించడం లేదు. దీంతో లక్షలువెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. దీనికి తోడు గ్రామాల్లో తడిపొడి చెత్త, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తున్నాయి.

నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్

గ్రామాల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీలో కంపోస్ట్ షెడ్డు నిర్మించింది. ఒక్కో షెడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు వెచ్చించింది. అయితే ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన లేకపోవడంతో గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్‌లో ఎటుపడితే అటు చెత్తను గుమ్మరిస్తున్నారు. ట్రాక్టర్‌లో వద్ద వ్యర్థాలను కంపోస్ట్ షెడ్ దగ్గరకు తెచ్చి వేరుచేయాలి. అటువంటిది ఏమీ లేకుండానే పరిసరాల్లో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డ్ పోసి, నిప్పుపెడుతున్నారు. దీంతో కంపోస్ట్ షెడ్‌లు ఉపయోగంలో లేకుండాపోయాయి.

తయారుకాని ఎరువు...

ఉమ్మడి పీఏపల్లి మండలంలోని 31 గ్రామపంచాయతీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తో పాటు నీళ్ల ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేందకు బుట్టలను పంపిణీ చేసింది. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించలేకపోయారు. గ్రామాల్లో ఎరువు తయారుచేస్తున్న దాఖలాల్లేవు. సేంద్రీయ ఎరువు తయారు చేసేలా షెడ్డు నిర్మించారు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామంలో పారిశుధ్యం, పరిశుభ్రత, అంటురోగాలు రాకుండా జాగ్రత్తలు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించడం తదితర అంశాలపై పనులు చేయాల్సి ఉంది. ప్రత్యేకాధికారుల పాలనలోనైనా కంపోస్ట్ షెడ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తారా లేదా అనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

ప్రత్యేక అధికారులతో చర్చించి చర్యలు చేపడతాం

గ్రామాల్లో నిర్మించిన కంపోస్ట్ షెడ్ నిరుపయోగంగా ఉన్నాయన్న విషయం తమ దృష్టికి రాలేదు. తడి, పొడిచెత్తను తప్పకుండా వేరుచేయాలి. వ్యర్థాలతో సంపదను సృష్టించాలి. పంచాయతీ ప్రత్యేక అధికారులతో పాటు, కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తాం. పనిచేయని అధికారులపై చర్యలు తీసుకుంటాం.

● చంద్రమౌళి, ఎంపీడీవో

సేవాలాల్ ఆశయాలు గిరిజనులకు స్ఫూర్తి


హిల్‌కాలనీలో పూజల్లో పాల్గొన్న జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 25 : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలే గిరిజనులకు, యువతకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ 285వ జయంతి వేడుకలను హిల్‌కాలనీలోని సేవాలాల్ ప్రాంగణంలో అఖిల భారత బంజారా సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ మార్గం అందరికీ ఆదర్శనీయం, ఆచరణీయమన్నారు. అహింసామార్గాన్ని సూచించి పరస్పర శాంతి సహకారం కృషి చేశాడని కొనియాడారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బంజారా సీనియర్ నాయకులు శంకర్‌నాయక్, ఏబీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబూరావ్‌నాయక్, ఉపాధ్యక్షుడు భగవాన్‌నాయక్, కార్యదర్శి స్కైలాబ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు భారతిభాస్కర్ నాయక్, రవినాయక్, సక్రునాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, బిక్షంనాయక్, మేరావత్ మునినాయక్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్ చందూలాల్ నాయక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

గుర్రంపోడు : గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లకుంట గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తగుల్ల సర్వయ్య, మాజీ ఎంపీపీ చనమల్ల మాధవీజగదీష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీష్‌రెడ్డి, వలిశెట్టి వెంకటయ్య, సింగిల్ విండో వైస్‌చైర్మన్ యాదవరెడ్డి, బొమ్ము శ్రీను, వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి, కమతం జగదీష్‌రెడ్డి, మేడి వెంకన్న, కొత్త నాగరాజు, దిలీప్‌రెడ్డి, గణేష్‌నాయక్, షర్పుద్దీన్ పాల్గొన్నారు.

ప్రెస్‌అకాడమీ చైర్మన్ నియామకంపై హర్షం

నార్కట్‌పల్లి / నల్లగొండ / హాలియా, ఫిబ్రవరి 25: మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కల్మెకొలను శ్రీనివాస్‌రెడ్డి రెండోసారి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియామకం కావడంపై పలువురు జర్నలిస్టులు, సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నార్కట్‌పల్లి మండలానికి చెందిన విలేకరులు దేవరశెట్టి నారాయణ, బాశెట్టి శ్రీనివాస్, ప్రజ్ఞాపురం శివశంకర్, ఎండీ సాదత్‌అలి, పసునూరి చంద్రశేఖర్, ప్రజ్ఞాపురం కృష్ణ, పల్లె తిరుమల్, బండారు రాంబాబు, రాధారపు రమేశ్‌లతో పాటు సీపీఐ, కాంగ్రెస్ నాయకుల లొడంగి శ్రవణ్‌కుమార్, పెండ్యాల శంకర్, వెంపటి శ్రీనివాస్, కొంపెల్లి సైదులు, షేక్ యూనస్, బండా అమృతారెడ్డి, హర్షం వెలిబుచ్చారు. అదేవిధంగా టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రెస్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు దోటి శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని హర్షిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్టల సైదులు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుకు ప్రెస్ అకాడమీ చొరవ చూపించాలని వారు కోరారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు పేలపూడి బాలకృష్ణ, సముద్రాల దామోదర్, చాపల నరేందర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం


కేటీఆర్‌ను సన్మానిస్తున్న నాయకులు

డిండి, ఫిబ్రవరి 25: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు డిండి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనస్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహిస్తున్న పార్టీ సమావేశానికి వెళ్తున్న కేటీఆర్ రాజీవ్‌చౌరస్తా వద్ద కొద్దిసేపు ఆగి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు కేటీఆర్‌కు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బాదమోని శ్రీనివాస్‌గౌడ్, గిరిమోని శ్రీను, గుర్రం సురేష్, మాదవ్‌గౌడ్, తండు శ్రీనయ్య, తండు చంద్రయ్య, పోలం ఈశ్వర్, జైపాల్‌నాయక్, నజీర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మారుమూల తండాలన్నీ సస్యశ్యామలం

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మారుమూల తండాలు, గ్రామాలన్నీ సస్యశ్యామలం, సుందరంగా అవుతాయని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. సపావత్‌తండాలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు నాగరాజు, మేరావత్ మునినాయక్, శివాజీనాయక్, బిక్కునాయక్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు బాసటగా నిరంతర కృషి



మెగాజాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఫిబ్రవరి 25 : నకిరేకల్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు బాసటగా నిలిచేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో 65కంపెనీలతో నిర్వహించిన మెగాజాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ పేద విద్యార్థికి అండగా ఉండటమే లక్ష్యమన్నారు. జాబ్‌మేళా ద్వారా విద్యార్థ బంగారు భవిష్యత్‌కు అండగా ఉండటమే తమ లక్ష్యమన్నారు. ప్రతీ పేద విద్యార్థి కలలను నెరవేర్చడంలో తాను తోడ్పాటుగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, టీపీసీసీ మెనిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, కంపెనీ ప్రతినిధులు మన్మోహన్, సత్య పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వీరేశం

ఎన్నికల హామీల అమలులో భాగంగా ఎమ్మెల్యే వీరేశం మెగాజాబ్‌మేళా నిర్వహించి, మాట నిలబెట్టుకున్నారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు కొమ్మనబోయిన సైదులుయాదవ్ అన్నారు. నకిరేకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాబ్‌మేళాతో ఉద్యోగాలు కల్పించడం మంచి పరిణామమన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌కుమార్, ఏర్పుల గణేష్, శంకర్, ఆనంద్, మధుసూదన్‌రెడ్డి, అనుముల శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, నరేష్, సింహాద్రి, చంద్రశేఖర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ముప్పై ఏళ్ల తర్వాత..అపూర్వ సమ్మేళనం


నిడమనూరు మండలం ఎర్రబెల్లి ఉన్నత పాఠశాలలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు


నార్కట్‌పల్లి ఉన్నత పాఠశాలలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

నిడమనూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ఎర్రబెల్లి ఉన్నత పాఠశాలలో 1986-86, 1986-87 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించారు. సమ్మేళనం ఏర్పాటు అభినందనీయమని రిటైర్డ్ హెచ్‌ఎం రామారావు అన్నారు. గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నందికొండ రామేశ్వరీ, పూర్వ విద్యార్థులు సామల వెంకటేశం, సురుగురు శ్రీనివాస్‌రెడ్డి, మీసాల శ్రీనివాస్, సీనియర్ పూర్వ విద్యార్థి టెలికాం, నల్లగొండ, ఖమ్మం జిల్లాల మేనేజర్ పి.వెంకటేశం, నందికొండ మట్టారెడ్డి, చిత్రం ప్రసాద్, ఎల్లయ్య, నరేందర్‌రెడ్డి, చిత్రం వెంకటయ్య, కుక్కడపు నారాయణ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లిలోని ఉన్నత పాఠశాల 1988-89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాలు జరిగింది. 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఆనాటి తరగతి గదుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, ఆలంపల్లి వేణు, రంగా లక్ష్మీనారాయణ, సిద్దయ్య, అర్థం శ్రీను, గాలి నర్సింహ్మా, పూల రమేశ్‌చంద్ర, గంజి శ్రీను, శ్రీదేవి, కల్యాణి, ఉమారాణి, రమాదేవి హాజరయ్యారు.

కట్టంగూరు: మండలంలోని ఈదులూరు ఉన్నత పాఠశాలలో 1984-85 పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణాచారి, ఉపాధ్యాయులు లింగారెడ్డి, సాజీద్ ఆలీ, మహ్మద్ ఆలీలను సన్మానించారు. కార్యక్రమంలో పాపయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, మదనాచారి, హనుమంత్, యాదమ్మ ఉన్నారు.

మునుగోడు: మునుగోడు పలివేల ఉన్నత పాఠశాల 1993-94 ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముప్పై ఏళ్ల తర్వాత కలువడంతో వారి ఆనందాలకు అవధుల్లేకుండా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


మునుగోడు మండలం పలివెల ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం : మండలంలోని గురజాల ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి హెచ్‌ఎం మారం సంతోష్‌రెడ్డి, గురువులు చిక్కు చంద్రమౌళి, యాదగిరి, పోషణాచారి, కుర్రె యాదగిరి,ఇంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, మారోజు వెంకటాచారిలను సన్మానించారు. కార్యక్రమంలో కందుకూరి శ్రీనివాసచారి, వెంపటి హన్మంత్, కుర్రె నర్సింహారాజు, ఒగోటి కృష్ణ, కోక మల్లయ్య, గౌతమ్, రామాచారి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు 528మంది హాజరు

నల్లగొండ, ఫిబ్రవరి 25: ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు 528మంది హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు 850మందికి 528మంది హాజరుకాగా 322మంది గైర్హాజర్ అయ్యారని డీఈవో భిక్షపతి తెలిపారు.

నేడు ఎంజీయూలో మెగా జాబ్‌మేళా

నల్లగొండ, ఫిబ్రవరి 25: కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ)లో సోమవారం నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు ఏర్పాట్లుచేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 100కుపైగా ఫార్మా ఐటీ, ఇతర రంగాల నుంచి వివిధ కంపెనీలు ఎంజీయూ వేదికగా ఎంపికలు చేపడతాయని తెలిపారు. 10వేలకు పైగా అభ్యర్థులు హాజరుకానందున అదేస్థాయిలో సదుపాయాలను కల్పించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు బయోడేటాతో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 25 : పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు సైతం తాము సిద్ధమని ప్రకటించారు. ఆదివారం సంఘ కార్యాలయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో సీపీఎస్ రద్దు ప్రకటన కోసం 2లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలు ఎదురుచూస్తున్నాయన్నారు. రాబోయే ఉద్యోగ ప్రకటనల్లో పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేస్తూ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల, ఫిబ్రవరి 25 : వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సత్సంగ కేంద్రం చిట్యాల ఇన్‌చార్జి చంద్రశేఖర్ భాసిరి అన్నారు. ఆదివారం చిట్యాలలో కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సత్సంగం సభ్యులు బండారు జనార్ధన్, శీలా రమేష్, బండారు సత్యనారయణ, బూరుగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ

హాలియా: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సీఐఎస్ టెక్నాలజీస్ ఫౌండర్ మాలే సతీష్‌రెడ్డి అన్నారు. హాలియాలోని టైం పాఠశాలలో నిర్వహించిన 6వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రదర్శించిన రామాయణ కథ సన్నివేశం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మందా నరేందర్‌రెడ్డి, గ్యాస్ట్రోలజిస్ట్ డాక్టర్ కీర్తి రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, గౌని రాజారమేష్ యాదవ్, హెచ్‌ఎం కత్తి కోటిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

సంఘ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 25 : నూతనంగా ఎన్నికైన నాయకులు అసోసియేషన్ బలోపేతానికి కృషి చేయాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తుల మల్లేశం అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపూడి జైపాల్, గౌరవ సలహాదారుడు దాసరి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం నూతన కమిటీ ఎన్నిక

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25: చెర్వుగట్టు మత్స్యకార సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌గా బండమీది లింగస్వామి, ఉపాధ్యక్షుడిగా వనం శంకర్, కోశాధికారిగా వనం రామలింగం, డైరెక్టర్లుగా వనం శంకర్, వనం రవి, కుక్కల నర్సింహ, వనం రాజు, వనం శోభన్‌బాబు, పిట్టల రమేశ్‌లు ఎన్నికయ్యారు. సంఘ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ సన్మానించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 25 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నరసింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాన్‌రెడ్డి, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌టీఎస్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

చిట్యాల: ఎమ్మార్పీఎస్‌టీఎస్ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చిట్యాలకు చెందిన పోలేపల్లి సత్యనారయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు సంఘం ఆధ్వర్యంలో పోరాడతామన్నారు.